క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలకడ : ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ రహీమ్ తెలిపారు. ఈ సమావేశానికి పీలేరు ఎమ్మెల్యే కిషన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3–00 గంటలకు నిర్వహించనున్న సమీక్ష సమావేశంలో అభివృద్ధిపై శాఖల వారి సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

ఏనుగు మల్లమ్మకు పూజలు



విశేషాలంకరణలో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ విద్యుత్‌దీపాలు, ప్రత్యేక పుష్పాల అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. దీపావళిని పురస్కరించుకుని రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమావాస్య, దీపావళి సందర్భంగా అభిషేకాలు చేశారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల రద్దీ



గాలిబండపై సందర్శకులు

బి.కొత్తకోట: వరుస సెలవులతో పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై రద్దీ నెలకొంది. శుక్రవారం వివిధ ప్రాంతాలకు చెందిన సందర్శకులు పెద్దసంఖ్యలో కొండకు వచ్చారు. వాతావరణం ముసురుపట్టి ఉండటం, ఆహ్లాదకరమైన చల్లటిగాలిని ఆస్వాదిస్తూ పర్యాటకులు కొండపై సందడి చేశారు. ప్రకృతి అందాలను తిలకిస్తూ, గాలిబండపై సేదతీరారు.

పరామర్శ



రాజగోపాల్‌రెడ్డి దంపతులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దంపతులు

కలకడ : కోన సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారి దంపతులను పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి, నీరజ, కోడలు శ్రీయ పరామర్శించారు. రాజగోపాల్‌రెడ్డి కంటికి శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న రామచంద్రారెడ్డి దంపతులు శుక్రవారం గంగిరెడ్డిగారిపల్లెకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మండలంలోని కదిరాయచెర్వు గ్రామానికి చెందిన మాజీ మండల ప్రత్యేక ఆహ్వానితులు జి.వి. కిషోర్ తండ్రి పెద్దరెడ్డెప్పశెట్టి అనారోగ్యం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న రామచంద్రారెడ్డి ఇంటికి వెళ్లి పెద్దరెడ్డెప్పశెట్టి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ఎలాంటి సమస్యలున్నా తనకు తెలియజేయాలని కోరారు.

సంతాపం



రెడ్డెప్పరెడ్డి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన స్థానిక నాయకుడు, రైతు గాండ్లపెంట రెడ్డెప్పరెడ్డి మృతి పట్ల తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సంతాపం తెలిపారు. రెడ్డెప్ప రెడ్డి విద్యుత్ షాక్‌తో ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం కనసానివారిపల్లెకు రెడ్డెప్ప రెడ్డికి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాధితుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి, అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, మూర్తినాయునిపల్లె చక్రపాణి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



వీఆర్ఏ లక్ష్మయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ పణికుమార్

కలకడ : మండలంలోని నడిమిచెర్ల గ్రామంలో గురువారం రాత్రి అనారోగ్యంతో నడిమిచెర్ల వీఆర్ఏ లక్ష్మయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పణికుమార్ శుక్రవారం సిబ్బందితో నడిమిచెర్లకు వెళ్లి లక్ష్మయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. ప్రభుత్వం నుంచి రూ.20,000 ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

ముందుకు సాగవు.. తిప్పలు తీరవు

- పీలేరులో నత్తనడకన ఆర్‌ఓబీ నిర్మాణ పనులు
- తాత్కాలిక రోడ్లు వేయకుండా పనులు
- దుమ్ము, దూళితో తీవ్ర ఇబ్బందులు



పీలేరు పట్టణంలో జరుగుతున్న ఆర్‌ఓబీ నిర్మాణ పనులు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనులు నత్తనడకన సాగుతుండడంతో పట్టణ ప్రజలకు, వ్యాపారులకు, వాహన చోదకులకు తిప్పలు తప్పడం లేదు. పనులు ప్రారంభించి ఏడాది దాటినా ఓ కొలిక్కి రాకపోవడంతో సమస్యలు ఎప్పుడు తొలగుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో..

పీలేరు పట్టణంలో మదనపల్లె రోడ్డుమార్గం, చిత్తూరు రోడ్డు మార్గంలో రైల్వే గేట్లు ఉండడంతో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆర్‌ఓబీల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపారు. పీలేరు పట్టణంలో ఆర్‌ఓబీల ఆవశ్యకతపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైల్వే, జాతీయ రహదారుల మంత్రులతో అనేకమార్లు సంప్రదించి పీలేరు పట్టణానికి రెండు ఆర్‌ఓబీలు మంజూరు చేయించేలా కృషి చేశారు. 2023 జూన్ 20న పనులు ప్రారంభించారు. మదనపల్లె – తిరుపతి జాతీయ రహదారి–71లో రూ.38.41కోట్లుతో, పీలేరు–చిత్తూరు రోడ్డు మార్గంలో ఎస్‌హెచ్–40లో రూ.37.54కోట్లతో ఆర్‌ఓబీల పనులు జరుగుతున్నాయి.

నత్తనడకన పనులతో ప్రజలు బేజారు

పీలేరు పట్టణంలో రెండు చోట్లా పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించి సుమారు 15 నెలలు పూర్తయినా ఇప్పటి వరకు 40 శాతం పనులు మాత్రమే కావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌ఓబీ పనులు చేయాలంటే ప్రజలకు, వాహనచోదకులకు ఇబ్బందిలేకుండా ముందగా తాత్కాలిక రోడ్డు గానీ, సర్వీసు రోడ్డు గానీ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆవేమీ పట్టించుకోకుండా పనులు చేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఓ వైపు పనులు చేస్తుండడం, మరోవైపు మట్టి రోడ్డు మొత్తం గుంతలుగుంతలుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎండకాస్తే పట్టణమంతా దుమ్ము దూళితో నిండిపోతోంది. వర్షం కురిస్తే రోడ్డు మొత్తం బురదమయం అవుతోంది. దీంతో రెండు మార్గాల్లో ప్రజలు గానీ, వాహనదారులు గానీ వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌ఓబీల నిర్మాణం వేగవంతం చేసి పూర్తి చేయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కొన్ని ముఖ్యమైన ప్రాంతాలు, హాస్పిటల్స్, పాఠశాలలు, కళాశాలలు వద్ద ఎక్కడ సర్వీసు రోడ్డు వేస్తారో, ఎక్కడ యూటర్న్ పెడతారో తెలియని పరిస్థితి నెలకొంది.

వ్యాపారాలు తగ్గాయి



పీలేరు పట్టణంలోని ఎల్‌బీఎస్ రోడ్డు మార్గంలో నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండేది. దీంతో నెలవారీ అద్దె చెల్లించి తమ కుటుంబాలను పోషించేకునే పరిస్థితి ఉండేది. ఆర్‌ఓబీ పనులు చేపట్టిన నాటి నుంచి ఏడాది కాలంగా బట్టల దుకాణంలోకి అధికంగా దుమ్ము చేరడంతో రోజువారి శుభ్రం చేసుకోవడం కూడ కష్టంగా ఉంది. షాపు దుమ్ముతో నిండిపోవడంతో వినియోగదారులు కూడా రావడం లేదు.

– జయప్రకాష్‌రెడ్డి, బట్టల వ్యాపారి, పీలేరు

నష్టపోతున్నాం



పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డు మార్గంలో చికెన్ సెంటర్ నిర్వహించుకుంటున్నాం. ఆర్‌ఓబీ నిర్మాణం పనులతో వాహనాలు షాపు ముందు నిలబడే అవకాశం లేదు. చికెన్‌పై కూడా దుమ్ము అధికంగా పడుతుంది. దీంతో కొనుగోలుదారులు చికెన్ కొనుగోలుకు సిద్ధపడటం లేదు. దీంతో పెట్టుబడి పెట్టి నష్టపోవాల్సి ఉంది. అధికారులు స్పందించి వెంటనే పనులు త్వరగా పూర్తి చేయాలి.

– ఎస్.మసూద్, చికెన్ సెంటర్ నిర్వాహకుడు, పీలేరు.

పూర్తి చేయడానికి చర్యలు



గడువులోపు పీలేరు – మదనపల్లె రోడ్డు మార్గంలో చేపట్టిన ఆర్‌ఓబీ నిర్మాణం పనులు 40 శాతం పూర్తయ్యాయి. మరో 10 నెలల్లో పనులు పూర్తి చేసి, తరువాత సర్వీసు రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేస్తాం. చిత్తూరు రోడ్డు మార్గంలో నష్టపరిహారం కోసం కొందరు కోర్టుకు వెళ్లడంతో పనులు కాస్త ఆలస్యం అయ్యాయి. ఏడాదిలో ఆర్‌ఓబీ పూర్తి చేయడానికి కృషిచేస్తాం. పనులకు సంబంధించిన నివేదికలు అధికారులకు పంపాము.

– ఓ. నాగరాజ, ఎన్‌హెచ్ డీఈ, తిరుపతి

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నిసార్‌అహ్మద్



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, నాయకులు

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని శుక్రవారం మదనపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ మదనపల్లె సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తిరుపతిలో కలిశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతంపై చర్చించామని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని పెద్దిరెడ్డి భరోసా ఇచ్చారని నిసార్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునిశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కేవీపల్లె : గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్‌డీ గఫూర్ తెలిపారు. మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లెలో బోరుకు మరమ్మతులు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మంచి నీటితో ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు బోర్లకు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. జిల్లేళ్లమంద పంచాయతీలో పాతకురవపల్లె, బడికాయలపెంట, విజయనగరం కొత్తవడ్డిపల్లెలోనూ బోర్లకు మరమ్మతులు చేశామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేసేందుకు బాబు కుట్ర



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్

మదనపల్లె : ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో మదనపల్లెతో పాటు మరో నాలుగుచోట్ల మెడికల్ కళాశాలలు ప్రారంభం కావాల్సి ఉండగా, కూటమిప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కేంద్ర ప్రభుత్వం అనుమతుల నిరాకరించిందని తెలిపారు. ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లను, సూపరింటెంట్లను బదిలీ చేసిందన్నారు. మదనపల్లెలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో పేదలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందుతుందన్న ఆశలను చంద్రబాబు అడియాశలు చేశారని మండిపడ్డారు. మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజీని సాధించేంతవరకు బీఎస్పీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, ఉదయ్, శ్రీనివాసులు, లక్ష్మీపతి, గంగాధర్, శ్రీనాథ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కలికిరి: ట్రాక్టర్, బైక్ ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని గుట్టపాళెం గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లికి చెందిన మనోహర్ కలికిరిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు. సాయంత్రం కళాశాల అనంతరం అదే గ్రామానికి చెందిన ప్రభాకర్, గణేష్‌లతో కలిసి బైక్‌లో స్వగ్రామానికి వెళుతుండగా గుట్టపాళెం గ్రామం కుమ్మరపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. ప్రమాదంలో ప్రభాకర్ కాలు తెగిపడింది. గణేష్, మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రభాకర్‌ను ప్రైవేటు వాహనంలో తిరుపతికి తరలించారు. మిగిలిన ఇద్దరిని 108 సిబ్బంది చంద్రబాబు, ఎస్వీ రమణ కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పీలేరుకు తీసుకెళ్లాలని సూచించడంతో పీలేరుకు తీసుకెళ్లారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ చిప్పిలి చలపతి తదితరులు

మదనపల్లె : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా కురవంక పంచాయతీలో రూ.18లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ సర్పంచ్ చిప్పిలి చలపతి తెలిపారు. శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె మండలంలో రూ.4కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైగారి భారతి, వార్డు సభ్యులు నాగరాజు, సెక్రటరీ షబానా, తులసి, శ్రీనివాసులు, బీవైఎస్ అధ్యక్షుడు పునీత్, ఆది, జగదీష్, చిప్పిలిహరి, శ్రీధర్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



మదనపల్లె సిటీ: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



పీలేరు: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని పాఠశాల ఆవరణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు పొట్టి శ్రీరాములు

పీలేరు : పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకులు కొనియాడారు. శుక్రవారం వారాంతపు సంత వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని తెలిపారు. అనంతరం పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌గా మారిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆవోపా, వాసవిక్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ నాయకులు రాచపల్లె శ్రీనివాసులు, కృష్ణమూర్తి, బాలసుబ్రమణ్యం, అరవింద్‌బాబు, సురేష్, అశోక్, జయచంద్ర, మురళి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కేవీపల్లె : ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ నగిరి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 35,470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జాతీయ పోటీల్లో సత్తా

కురబలకోట: ప్రొద్దుటూరు సాయి రాజేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులు ఎం. రాఘవేంద్ర, ఎస్. పవన్‌కుమార్, పి. గోవింద లిఖిత బిజినెస్ క్విజ్‌లో మొదటి బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఇదే కళాశాలకు చెందిన సీఎం ప్రమోదిని యువ మేనేజర్ పోటీలలో మొదటి బహుమతి సాధించినట్లు తెలిపారు.

ఇందిరాగాంధీకి నివాళి

మదనపల్లె : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు గురువారం బెంగళూరు బస్టాండ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన ఉక్కుమహిళ ఇందిరా గాంధీ అంటూ కొనియాడారు. గరీబీ హఠావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మీనాకుమారి, ముబారక్‌ఖాన్, డాక్టర్.ఎస్.కే.బాషా, సోమశేఖర్, సమీర్, గంగులప్ప, మహబూబ్‌పీర్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు నోటీసులు

కలికిరి: ఎన్టీఆర్ పెన్షన్‌ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ భానుమూర్తి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. మండల పరిధిలోని మేడికుర్తి సచివాలయ విలేజ్ సర్వేయర్ ఎస్.ఫిర్దోష్, కలికిరి–2, పత్తేగడ సచివాలయాల వీఏఏలు జి.సాయి లోకేష్, పి.రాజేష్ నోటీసులు అందుకున్నవారిలో ఉన్నారు. ఉదయం 7.30 గంటలకు కూడా లాగిన్‌లో పెన్షన్ పంపిణీ చేయకపోవడంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ నోటీసులిచ్చారు. 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

హామీ నిలబెట్టుకున్నాం



ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి

పీలేరు : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదిలో మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని తెలిపారు. వీలైనంత త్వరగా అర్హులైన పేదలకు రెండెన్నర సెంటు చొప్పున ఇంటి స్థలాలు ఇవ్వడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మదనపల్లె : మహిళా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిప్పుసుల్తాన్ గ్రౌండ్స్‌లో దీపం ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తులసీ, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, రాధ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మదనపల్లె సిటీ: ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో రాయలసీమ జిల్లాలకు చెందిన రాష్ట్ర ఉర్దూ టీచర్ల సంఘం (రూటా) ప్రాంతీయ సదస్సు జరిగింది. కార్యక్రమంలో రూటా రాష్ట్ర నాయకులు హాజీ సయ్యద్ హిమాయతుల్లా, సయ్యద్ ఇక్బాల్, సత్తార్‌ఫైజీ, మహమ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నాలజీని వినియోగించుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో డిస్కవర్ ఆఫ్ ఫ్యూచర్ టెక్నాలజీ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. టెక్నాలజీతో ఏ విధంగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చుననే విషయాలను వివరించారు. విద్యార్థులు కష్టపడి చదవితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, వాల్‌మార్ట్ టెక్నాలజీస్ ఆంజనేయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్రతం

పీలేరురూరల్ : స్థానిక శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో దీపావళి అమావాస్యను పురస్కరించుకుని మహిళలు కేదారేశ్వరస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం పలువురు మహిళా భక్తులు ఆలయంలో కేదారేశ్వరస్వామి వ్రతం చేపట్టి నోములు నోచుకున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థిని రుబియాకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, రత్నశేఖర్‌రెడ్డి

కలికిరి: మేడికుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24లో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం మానవత సంస్థ కలికిరి శాఖ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సహకాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానవత సంస్థ మండల చైర్మన్ రత్నశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో సంస్థ ముందుంటుందని, గ్రామీణ పేద విద్యార్థులను ప్రోత్సహించడానికి ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పది ఫలితాల్లో పాఠశాలకు చెందిన రాబియా (536), లిఖిత(522), రెడ్డిచరణ్ (452) రూ.5, రూ.3, రూ.2వేలు అందజేశారు. సర్పంచ్ నాగవేణి, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, హెచ్‌ఎం జాకీర్ మొహమ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు

కేవీపల్లె : దళితులకు న్యాయం చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ మాట్లాడుతూ మండలంలోని గాలివారిపల్లె పంచాయతీ దిన్నెమీదపల్లె హరిజనవాడకు చెందిన దళితులను మభ్యపెట్టి ఎస్సీ కార్పొరేషన్‌లో మంజూరు చేసిన భూమిని రవీంద్రనాథ్‌రెడ్డి లాక్కున్నాడని ఆరోపించారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. చిన్న, రామసుబ్బమ్మ, వెంకటసుబ్బమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

పీలేరు : ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా జీతం చెల్లించాలని, వారికి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయాలు సుమతి, యశోద, రత్నమ్మ, రవణమ్మ, రెడ్డమ్మ, సరస్వతి, రమాదేవి, నీలావతి, భారతమ్మ, నూర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీ లక్ష్మీనరసింహుని కల్యాణం



శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. శుక్రవారం స్వామివారి జన్మదినం సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలకు ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు.ఈ కార్యక్రమంలో అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణస్వామి, రాజు, అనిల్, గోకుల్ స్వాములు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

దివ్వెల పండుగ.. సంతోషాలు పంచగా..!



దీపాలు వెలిగిస్తున్న చిన్నారులు

మదనపల్లె సిటీ: కాంతులు లోకానికి తెలిసేవిధంగా గురువారం మదనపల్లె పట్టణంలో ఆనందాల దీపావళిని వైభవంగా నిర్వహించుకున్నారు. ఇంటిల్లిపాదీ మహిళలు తమ గృహాల చెంత దీపాల వరుసలను తీర్చి కోటి ఆనందాల కాంతిని నింపగా వైభవంగా దీపావళి పండుగ సంబరాలు చేసుకున్నారు. ఇంటి ముంగిట చిన్నారులు బాణాసంచా వెలిగిస్తూ కేరింతలు కొడుతూ ఆనందాల దీపావళి వేడుకను నిర్వహించారు. షాపుల్లో లక్ష్మి పూజలు నిర్వహించారు. వాహనాలకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

అమావాస్య నోములు

స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య నోముల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ఆవరణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి కేదారగౌరీనోముల వ్రత సంకల్ప కథను అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ భక్తులకు వినిపించారు.

పురవీధుల్లో ఊరేగిన వెంకన్న

దీపావళి పండగను పురస్కరించుకుని స్థానిక ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో విహరించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేడుకలో పట్టణంలోని పలువురు భక్తులు పాల్గొన్నారు.